


చంద్రబాబు పర్యటనలో మార్పు



శృంగవరపుకోట ఏప్రిల్ 19: టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడి శృంగవరపుకోట ఎన్నికల ప్రచార సభలో మార్పు జరిగింది. ఈనెల 21కి బదులు 22న సాయంత్రం 4గంటలకు వస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బుచ్చి అప్పలరామప్రసాద్ తెలిపారు. తొలుత ఈనెల 21 వస్తారని టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారికి సమాచారం అందింది. అయితే శుక్రవారం నాటికి మార్పులు చేస్తూ అధిష్ఠానం నుంచి సమాచారం అందింది. 22న వస్తున్నట్లు చెప్పడంతో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.



మానాపురం వద్ద నత్తనడకన సాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి

ఐదేళ్లలో ఏమీ చేయలే!

- జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి వేలాది మంది యువతీయువకులు నిరుద్యోగులుగా ఉన్నారు. వీరంతా ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్నారు. దీనికి కారణం జిల్లాలో పరిశ్రమలు లేకపోవడమే. ఉపాధి మార్గాలపై ప్రభుత్వం కనీసం దృష్టి పెట్టలేదు. దీంతో చదువుకున్న యువత హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు ఐటీ ఉద్యోగాల కోసం వలస వెళ్లారు. ఏ తల్లిదండ్రులను కదిపి మీ పిల్లలు ఏం చేస్తున్నారని అడిగినా ఇతర రాష్ట్రాల పేర్లే చెపుతున్నారు. అంత దారుణమైన పరిస్థితిని వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చింది.
- లక్షలాదిమంది యువత ఉపాధి నమోదు కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకుని ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ఉద్యోగాలను భర్తీ చేయకుండా ప్రభుత్వం నిరుద్యోగాన్ని పెంచి పోషించింది. వివిధ కార్యాలయాల్లో ఉద్యోగ విరమణ చేస్తున్నా వారి స్థానంలో తిరిగి నియామకాలు చేపట్టడం లేదు. సచివాలయ ఉద్యోగాల గురించి తప్ప వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఏం చేసింది చెప్పలేకపోతోంది. ఇలా అనేక సమస్యలు ప్రజలను వెంటాడుతుంటే అంతా సిద్ధం అంటూ ప్రచారం చేస్తూ వైసీపీ ఎన్నికల ప్రచారం చేస్తోంది. పెండింగ్ పనులు, అభివృద్ధి లేకపోవటం, నిరుద్యోగం ఇదేనా అంతా సిద్ధం అంటూ ప్రతిపక్షాలు ఘాటుగా విమర్శలు చేస్తున్నాయి.

- ఎక్కడికక్కడ నిలిచిన పనులు
- ఇంకొన్ని నత్తనడకన సాగుతున్న వైనం
- కొత్తగా రాని పరిశ్రమలు
- వలసబాట పట్టిన నిరుద్యోగులు
- జీతాల కోసం ఉద్యోగుల అవస్థలు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి అట్టడుగుకు చేరింది. ఏమీ చేయకపోవడమే అభివృద్ధి అన్న కొత్త నిర్వచనం ఇచ్చినట్టయింది. శిథిల భవనాలు.. నిలిచిన పనులే.. నత్తనడకన సాగుతున్న పనులే అంతటా కనిపిస్తున్నాయి. ఈ ప్రభుత్వం స్వయంగా మంజూరు చేసిన పనులు సైతం ఆగిపోయాయి. బిల్లులు చెల్లించకపోవడమే ఈ దుస్థితికి కారణం. ఉచితాల పేరుతో ప్రజాధనంతో ఓట్ల రాజకీయానికి పెద్దపీట వేసి అభివృద్ధి లేని పాలన అందించారన్న విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి. చివరికి ఉద్యోగులకు నిర్దిష్ట తేదీకి జీతాలు చెల్లించలేని స్థితికి తీసుకువచ్చారు. ఉపాధ్యాయ సంఘాలు సైతం నిత్యం జీతాల కోసం పోరాటాలు చేయాల్సి వచ్చింది. ఇక జిల్లా యువత అంతా ఇతర దేశాలు, రాష్ట్రాల్లో ఉద్యోగాల కోసం వలసపోతోంది. ఇంకొందరు ఉపాధి హామీ పథకం పనులకు వెళ్తున్నారు. అభివృద్ధి పనుల విషయానికి వస్తే ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. జిల్లా నుంచి ఒడిశా రాష్ట్రానికి వెళ్లే బొబ్బిలి-రాయగడ మార్గంలో సీతానగరం వద్ద సువర్ణముఖీ నదిపై వంతెనను మంజూరు చేశారు. బ్రిటీష్ కాలం నాటి వంతెన కూలిపోయే పరిస్థితి రావటంతో వైసీపీ ప్రభుత్వం రూ.11కోట్ల అంచనా వ్యయంతో నిధులు మంజూరు చేసింది. కాని బిల్లులు సక్రమంగా చెల్లించని కారణంగా కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా విడిచి పెట్టాడు. అంటే స్వయంగా వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులు సైతం కుంటుపడేలా చేశారు. జిల్లా వ్యాప్తంగా అనేక పనులు ఇలా మధ్యాంతరంగా నిలిచిన వాటిలో ఉన్నాయి.

- గత ప్రభుత్వ హయాం నుంచి కొనసాగుతున్న అభివృద్ధి పనుల పరిస్థితి అడగనవసరం లేదు. భోగాపురం విమానాశ్రయానికి, విజయనగర ప్రజల తాగునీటికి, నెల్లిమర్ల నియోజవర్గ రైతులకు సాగునీటిని అందించాల్సిన తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారు. కనీసం భూ సేకరణ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలను సైతం కొలిక్కితేలేకపోయారు. బడ్జెట్లో ఏటా నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించడం షరామామూలే. ఆ నిధులు విదల్చకుండా సాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తికాకుండా చేశారు.
- విజయనగరం నుంచి బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, ఒడిశాలోని రాయగడ, సాలూరు మీదుగా రాయ్‌పూర్ వంటి ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు వెళ్లాలంటే దత్తిరాజేరు మండలం మానాపురం వద్దనున్న రైల్వే గేట్ దాటాలి. దీనికి పరిష్కారంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన రైల్వే ఫ్లైఓవర్ పనులను సైతం గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేక పోయింది. దీంతో నిత్యం గేటు వేసేటపుడు వేలాది వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అంబులెన్స్‌లు వచ్చినపుడు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది.



బిల్లులు మంజూరు కాక నిలిచిపోయిన సీతానగరం వంతెన



ఎంపీ అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడి నామినేషన్, పక్కన అశోక్



నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న లోకం నాగమాధవి



రాజాంలో నామినేషన్ అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్

నామినేషన్లు షురూ

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయనగరం ఎంపీ అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం కలెక్టర్ నాగలక్ష్మికి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, జనసేన రాష్ట్ర నాయకులు యశస్విని, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు రెడ్డి పావని ఉన్నారు. తెలుగుదేశం రాజాం అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ శుక్రవారం రాజాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్‌కు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయన వెంట తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కొల్ల అప్పలనాయుడు, వంగర మండల టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ బొత్స వాసుదేవరావు నాయుడు ఉన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా జనసేన నాయకురాలు లోకం నాగమాధవి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి ఎం.నూక రాజుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ అందజేశారు. ఆమె వెంట టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు తదితరులు ఉన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ కూడా శుక్రవారమే నామినేషన్ దాఖలు చేశారు. డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ఎస్వీ రమణరాజు, నాయకులు మీసాల వరహాలనాయుడు, కుమార్తె అనూష, సోదరితో కలిసి వచ్చి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. బొబ్బిలి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు శుక్రవారం మూడు సెట్ల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీకి అందజేశారు.

రెండో రోజు భారీగా నామినేషన్లు

- అసెంబ్లీకు 33.. పార్లమెంట్‌కు 6

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

నామినేషన్ల ఘట్టంలో రెండో రోజున భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు మంచి రోజు చూసుకుని నామినేషన్ వేశారు. శుక్రవారం జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో 33 నామినేషన్లు వచ్చాయి. అలాగే పార్లమెంట్ స్థానానికి ఆరు నామినేషన్లు వేశారు. ఇందులో టీడీపీ ఎంపీ అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడు మూడు సెట్ల నామినేషన్లు ఇచ్చారు. స్వతంత్ర అభ్యర్థిగా సాగర్ నామినేషన్ వేశారు. మొత్తంగా పార్లమెంట్‌కు శుక్రవారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. అసెంబ్లీకి అందిన 33నామినేషన్లలో రాజాం టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ఉన్నారు. ఈయన రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారు. నెల్లిమర్ల నుంచి జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థిగా లోకం నాగమాధవి నామినేషన్ వేశారు. విజయనగరం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సుంకరి సతీష్, స్వతంత్ర అభ్యర్థులుగా మీసాల గీత, డి.వెంకటరమణలు నామినేషన్లు వేశారు. అలాగే చీపురుపల్లి నుంచి మంత్రి బొత్స సత్యనారాయణ వైసీపీ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. గజపతినగరం, బొబ్బిలి, ఎస్.కోటలో కూడా నామినేషన్లు దాఖలయ్యాయి.

కన్నీటిసంద్రం

- భరద్వాజ్ మృతిపై తల్లడిల్లిన రాజాం వాసులు
- ప్రభుత్వం పసివాడ్ని పొట్టన పెట్టుకుందన్న చంద్రబాబు

రాజాం రూరల్, ఏప్రిల్ 19: రాజాం పట్టణంలో అధికార పార్టీ ప్రచార రథం ఢీకొని బాలుడు భరద్వాజ్ మృతిచెందడం అందరినీ తీవ్రంగా కలచివేసింది. సమయానికి 108 వాహనం రాకపోవడం బాధాకరమని అందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల రోదనకు అంతే లేకుండా ఉంది. ఎంతో భవిష్యత్ ఉన్న బాలుడు ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ట్విటర్‌లో శుక్రవారం స్పందించారు. సమయానికి అంబులెన్స్ రాని దుస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ ప్రభుత్వం పసివాడ్ని పొట్టన పెట్టుకుందన్నారు. కాగా అప్పటివరకూ ఇంట్లో ఉన్న కుమారుడు భరద్వాజ్ కొద్ది నిమిషాలలో తనువు చాలించడాన్ని ఆ తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు. భరద్వాజ్‌ను బతికించుకునేందుకు వైద్యులు, సిబ్బంది చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. అత్యవసర విభాగంలో ఆక్సిజన్ అందించడంతో పాటు అత్యవసర వైద్యసేవలు, సుమారు అర్ధగంట సేపు సీపీఆర్ చేసినా ఫలితం దక్కలేదు. కాగా నెలరోజుల క్రితం సైతం ఇదే వాహనం ఓ చిన్నపిల్లల ఆటోను ఢీకొన్న ప్రమాదంలో పలువురు చిన్నారులు గాయాలపాలయ్యారు. ప్రచార రథం డ్రైవర్ మద్యం మత్తులో ప్రచారం చేస్తున్నాడని, ఆ కారణంగానే రెండుసార్లు ప్రమాదాలకు కారకుడయ్యాడని ప్రత్యక్ష సాక్షులు ఆరోపిస్తున్నారు.



విలపిస్తున్న తల్లి



బాలుడు భరద్వాజ్(ఫైల్)

ప్రతిపైసా జమ చేయాలి

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి
- వ్యయ పరిశీలకుల బృందం

కలెక్టరేట్, ఏప్రిల్ 19: నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయినందున అభ్యర్థి ఖర్చు చేసే ప్రతి పైసా వారి ఖాతాల్లో నుంచే జమ చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుల బృందం ప్రభాకర్ ప్రకాష్‌రాజన్ ఆనంద్‌కుమార్, ఆకాష్ దీప్‌లు అకౌటింగ్ బృందాలకు ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. కలెక్టర్ నాగలక్ష్మితో కలిసి వ్యయ పరిశీలకులు కలెక్టరేట్ నుంచి ఆయా శాఖ అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయినందున అభ్యర్థి ఖర్చు చేసే ప్రతి పైసా వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. సోషల్ మీడియా, టివి, ప్రత్రికలో వచ్చే ప్రకటనలను లెక్కగట్టాలన్నారు. బ్యాంకు ఖాతాల్లో అనుమానాస్పదంగా జరిగే లావాదేవీలు, డబ్బుల బదిలీలపై బ్యాంకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి రోజు నివేదికలను అందించాలని చెప్పారు. వ్యవ పర్యవేక్షణ అధికారులు ప్రతి రోజు క్షేత్రస్థాయిలో పర్యటించాలని చెప్పారు. వస్తు, నగదు పంపిణీపై దృష్టి పెట్టి కేసులు నమోదు చేయడంతో పాటు సమావేశాలు, ప్రకటనలపై చేసే ఖర్చును పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించడానికి, ఫిర్యాదులను స్వీకరించడానికి వివిధ విభాగాలను ఏర్పాటు చేశామని వివరించారు.

సచివాలయంలో గొడవ

- ఫర్నీచర్ ధ్వంసం చేసిన సిబ్బంది

రేగిడి, ఏప్రిల్ 19: మునకలవలస సచివాలయంలో శుక్రవారం ఉదయం సిబ్బంది మధ్య గొడవ జరిగింది. జీతం విషయంలో ఇద్దరు ఉద్యోగుల మధ్య మధ్య వివాదం తలెత్తింది. అది చినికిచినికి గాలివానగా మారింది. ఇద్దరూ తీవ్ర ఆగ్రహానికి గురైన క్రమంలో రెండు కుర్చీలు ధ్వంసంకాగా తనపై దాడి జరిగినట్లు ఓ ఉద్యోగి రేగిడి ఎంపీడీవో కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాడిలో తనకు గాయాలయ్యాయని, రాజాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని మరొకరు సచివాలయ ఉద్యోగుల గ్రూపులో మెసేజ్ పోస్టు చేశాడు. ఈ వివాదం మండలంలో చర్చనీయాంశమైంది.



ధ్వంసమైన కుర్చీలు

ప్రజల అవస్థలు పట్టవా?



విజయనగరం: బస్సుల కోసం కాంప్లెక్స్ లోపల నిరీక్షిస్తున్న జనం

- సీఎం 'సిద్ధం' సభలకు బస్సుల తరలింపు
- ప్రయాణికులకు ఎప్పటికప్పుడు తప్పని ఇక్కట్లు
- రెండు డిపోల పరిధిలో 45 బస్సుల కేటాయింపు

(విజయనగరం రింగురోడ్డు)

ఆర్టీసీ బస్సులో ప్రయాణం భద్రం అని నమ్మిన ప్రజలు కొన్నాళ్లుగా ఎప్పటికప్పుడు బస్సులు లేకపోవడం చూసి నిరాశ పడుతున్నారు. కొన్ని గంటలు వేచి చూసి ఆపై కూడా కూర్చోవ డానికి సీటు లేకుండా ప్రయాణించాల్సి రావడాన్ని చీదరించు కుంటున్నారు. కొందరైతే ఆర్టీసీ బస్సుల కోసం ఎదురుచూడడం మానుకున్నారు. తరచూ బస్సులను సిద్ధం సభలకు తరలించ డంతో ఆర్టీసీపై ఎంతో విశ్వాసం ఉన్న వ్యక్తులు కూడా నమ్మడం వృథా అని చెప్పుకుంటున్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి సభలకు బస్సుల తరలింపు తంతు కొన్ని నెలలుగా కొనసాగుతూనే ఉంది. ఎన్నికల షెడ్యూల్ రాకముందూ ఇదే పరిస్థితి. షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎన్నికల ప్రచారం కోసం నిర్వహిస్తున్న సిద్ధం సభలకు కూడా సమీప జిల్లాల నుంచి బస్సులను తీసుకుపోతున్నారు. తాజాగా తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన సిద్ధం సభలకు విజయనగరం, ఎస్.కోట డిపోల నుంచి బస్సులను భారీగా తరలించారు. దీనివల్ల ఆర్టీసీకి వచ్చే ఆదాయం ఎంత అనేది అధికారులు ప్రకటించాలని ప్రజలు కోరుతున్నారు. అసలే వేసవి కాలం.. నిర్దేశించిన సమయంలోగా ఇళ్లకు చేరుకోవాలని ఆర్టీసీ కాంప్లెక్స్‌కి చేరుకుంటే.. అక్కడ బస్సులు లేకపోవడం చూసి ఉసూరుమంటున్నారు. కనీసం ఆర్టీసీ అధికారులు ముందురోజే బస్సులు ఫలానా కార్యక్రమానికి వెళ్తున్నాయని, ఏఏ రూట్లలో, ఏఏ బస్సులు తిరగవో ప్రకటించడం లేదు. ముందే చెబితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటామని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

- విజయనగరం డిపో పరిధిలో 124 బస్సులు ఉండగా 30 బస్సులను సిద్ధం సభకి రాజానగరం పంపించారు. ఇక ఎస్‌కోట డిపోకి సంబంధించి 52 బస్సులు ఉండగా 15 బస్సులను సిద్ధం సభకు పంపించారు. దీంతో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. ఇందులో ప్రధాన రూట్లు అయిన బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు, విశాఖపట్టణం, రాజాం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తీవ్ర ఉక్కపోత, ఎండతో అవస్థలు పడడం కనిపించింది. చాలా సేపు నిరీక్షించి విసుగుచెందాక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. దీనివల్ల ఆర్టీసీ సంస్థకు ఆదాయం పోతోంది.



విజయనగరం: వెలవెలబోతున్న బస్సులు నిలిపే స్థలం



బైండోవర్ అంటే తెలుసా?

కొమరాడ/శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల పోలింగ్ దగ్గర పడింది. మే 13న పోలింగ్ జరగనుంది. కొద్ది కాలంగా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఎన్నికలు వచ్చాయంటే శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు అధిక ప్రాధాన్యమిస్తారు. వీటికి విఘా తం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతారు. గొడవలు సృష్టించేవారు... రౌడీషీటర్లు... బెల్ట్ దుకాణాలు నిర్వహించేవారు... నాటు సారా విక్రయించేవారు... ఇలా ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుంది. అలాంటి వారికి ముందస్తుగా పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తుంటారు. ఎన్నికల సమయంలో ప్రత్యేకంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తుంటారు.

బైండోవర్ అంటే (బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్) అని అర్థం. ఎనికల వేళ ఫలానా వ్యక్తుల వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావిస్తే... అతని చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని తెలిస్తే... పోలీసులు బైండోవర్ చేస్తారు. అలాంటి వ్యక్తులను తహసీల్దార్ లేదా ఆర్డీఓ ఎదుట హాజరు పరుస్తారు. చట్ట వ్యతిరేక పనులు చేయబోనని అతనిపై బాండ్ పేపర్ మీద లిఖిత పూర్వకంగా హామీ తీసుకుంటారు. సంబంధిత తహసీల్దార్ వారికి బైండోవర్ ప్రొసీడింగ్స్ జారీ చేస్తారు. సొంత పూచికత్తులపై ఆదేరోజు విడుదల చేస్తారు. అలా బైండోవర్ అయిన వ్యక్తి ఆ రోజు నుంచి ఏడాది వరకు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. అలా పాల్పడతే లిఖిత పూర్వకంగా ఇచ్చిన బాండ్‌లో ఎంత మొత్తం నమోదు చేసి ఉంటారో... అంత మొత్తం పెనాల్టీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించకపోయినా నేరం కిందనే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్లు 106, 107, 108, 110 కింద రెండు, అంతకన్నా ఎక్కువసార్లు బైండోవర్ అయితే అతనిపై రౌడీషీట్ నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఎన్నికల వేళ గుంపులు గుంపులుగా వెళ్లి గొడవలు పడటం... శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వంటి చర్యలకు పాల్పడకూడదు. ఎవరైనా పౌరులు తమపై అక్రమంగా పోలీసులు బైండోవర్ పెట్టారని భావిస్తే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు. కోర్టు పోలీసులకు నోటీసులు జారీ చేసి... రెండు వర్గాల వాదనలు విన్న తర్వాత కేసుపై నిర్ణయం తీసుకుంటుంది.

సోషల్.. మీడియా!

ఎన్నికలంటే హోరెత్తించే మైకులు.. గోడల మీద రాతలు.. లక్షలకొద్దీ కరపత్రాలు.. ఊరూవాడా వాల్‌పోస్టర్లు.. ఇదంతా గతం. ప్రచార సరళి ప్రస్తుతం పూర్తిగా మారిపోయింది. ప్రచారంలో సెల్‌ఫోన్ కీలక పాత్ర పోషి స్తోంది. ముఖ్యమైన సమా చారాన్ని క్షణాల్లో తమ అనుచరులకు చేరవేస్తు న్నారు. అభ్యర్థులకు సమయం ఎంతో ఆదా అవుతోంది. సామా జిక మాధ్యమాలను తమ ప్రచారాలకు ప్రధాన సాధనాలుగా వాడుకుంటున్నారు.

- వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ప్రచారం
- యూట్యూబ్‌లో అప్‌లోడ్.. లైవ్ వీడియోలు
- ప్రచారాల ఫొటోలు కూడా..



(రాజాం రూరల్)

గత ఎన్నికల్లో ఎస్సెమ్మెస్‌లకే పరిమితమైన ప్రచారం.. ఈసారి ఆధునికతను అందిపుచ్చుకుంది. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని రాజకీయ పార్టీల నాయకులు ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. సోషల్ మీడియా ఇప్పుడు ప్రధాన పాత్ర పోషిస్తోంది. తమ నాయకుడు ఏ రోజు.. ఏ సమయానికి.. ఏ వీధికి.. ఏ ప్రాంతానికి, ఏ గ్రామానికి ప్రచారానికి వస్తున్నారో సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఆ ప్రాంతాలకు వెళ్లిన క్షణాల్లోనే ఫొటోలు, వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. ఇందుకోసం అన్ని పార్టీల అభ్యర్థులూ ఒక్కొక్కరు కనీసం నలుగురైదుగురిని నియమించుకొని.. తమ రోజువారీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నారు.

లైవ్ వీడియోలు..

దాదాపుగా ప్రచారంలో లైవ్ వీడియోలకు ప్రాధాన్యం పెరిగింది. నాయకుడు గ్రామంలోనికి అడుగుపెట్టింది మొదలు ప్రజలతో మమేకమవుతూ... తనకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్న ప్రతి సన్నివేశాన్ని లైవ్‌ద్వారా ఫేస్‌బుక్... యూట్యూబ్‌లలో ప్రచారం చేస్తున్నారు. అభిమానులు,



కార్యకర్తలు కూడా ఇదే పంథాలో నాయకులను అనుసరిస్తున్నారు.

వాట్సాప్ గ్రూపులలో...




ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రతి అంశాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి వాట్సాప్ గ్రూపుల ద్వారా వందలాది మందికి చేరవేస్తున్నారు. పార్టీలు, కులాలు, కుటుంబాలు, ఉద్యోగ సంఘాలు, మీడియా, అధికారులు, ఇతరత్రా గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్నారు. అక్కడి నుంచి క్షణాల్లో మిగిలిన వారు షేర్ చేస్తున్నారు. దీంతో అత్యంత వేగంగా ప్రచారం జనంలోకి వెళ్లిపోతోంది. ఫలితంగా తక్కువ ఖర్చు...స్వల్ప సమయంలో వేలాదిమందికి సమాచారం చేరవేస్తున్నారు.

యూట్యూబ్‌లో...



ప్రస్తుతం యూట్యూబ్‌కు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ప్రత్యేకంగా వీడియోలను తయారు చేయిస్తున్నారు. పార్టీల హామీలను... గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ... భవిష్యత్‌లో చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ... వీడియోలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. లక్షలాది మంది వీక్షకులకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు.



అందరిదీ అదే బాట..

జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల నుంచి కూటమి, అధికార పార్టీల నుంచి 14 మంది శాసనసభకు.. ఇద్దరు లోక్‌సభకు పోటీలో ఉన్నారు. నామినేషన్ల పర్వం పూర్తయ్యేసరికి మరికొంత మంది అభ్య ర్థులు బరిలో ఉండే అవకాశాలు లేకపోలేదు. వీరిలో కూటమి, అధికార పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రత్యేకంగా సోషల్‌మీడియాకు విపరీతమైన ప్రాధాన్యం ఇస్తున్నారు. తమ ప్రచారానికి సంబంధించిన ప్రతి చిన్న విషయం ప్రజల్లోకి చొప్పిస్తున్నారు. అన్నివర్గాల ప్రజలు సైతం ఎప్పటికప్పుడు లైవ్‌లో వస్తున్న ప్రచారా లను చూసి తమకు నచ్చినవారి ప్రచారాలు 'షేర్' చేస్తున్నారు. అభ్యర్థుల గుణగణాలతో పాటు వారి హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి జరిగితే అభినందిస్తున్నారు. ఉత్సవ విగ్రహాలుగా అధికారాన్ని అనుభవించిన వారి పట్ల దురుసుగానే కామెంట్ల రూపంలో జవాబులిస్తున్నారు.



మహిళల ఆశీర్వాదమే కీలకం

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపునకు మహిళా ఓటర్లే కీలకంగా మారారు. గత రెండు దశాబ్దాలుగా వీరి తీర్పే అభ్యర్థుల విజయావకాశాలను నిర్ణయిస్తోంది. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉండడం... గంపగుత్తగా ఓట్లు వేయడం వల్ల వీరి ప్రభావం అధికంగా ఉంది. 2024 ఎన్నికల్లో కూడా మహిళా ఓటర్లే కీలకంగా మారనున్నారు. పాలకొండ నియోజకవర్గ పరిధిలో సీతంపేట, భామిని, వీరఘట్టం, పాలకొండ మండలాల్లో 2019 నాటికి మొత్తం 1,84,414 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుత ఓటర్ల జాబితా ప్రకారం 287 పోలింగ్ కేంద్రాల్లో 1,93,667 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 94,328 మంది. మహిళలు 99,325, ఇతరులు 14 మంది ఉన్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి అదనంగా 11 వేల ఓట్లు నమోదయ్యాయి. ఇప్పుడు కూడా మహిళలే కీలకపాత్ర పోషించబోతున్నారు. మరి వీరంతా ఎవరిని ఆశీర్వదిస్తారో చూడాలి.

పైసా ఖర్చు చేయకుండానే ఎమ్మెల్యేగా..

- నిస్వార్థ ప్రజాసేవకు నిదర్శనం అడ్డాకుల లక్ష్మునాయుడు



అడ్డాకుల లక్ష్మునాయుడు(ఫైల్)



గుమ్మలక్ష్మీపురం: ఒకప్పటి శ్రీకాకుళం జిల్లా... నేటి విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ గ్రామానికి చెందిన అడ్డాకుల లక్ష్మునాయుడు పైసా ఖర్చు చేయకుండా 1955లో ఆగూరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఇది కురుపాం శాసనసభ నియోజకవర్గంగా మారింది. ఆ తర్వాత ఆయన 1962లో మళ్లీ అదే నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. నిస్వార్థంగా సేవలు అందించారు. 1904లో పుట్టిన ఆయన 1972లో కన్నుమూశారు. ఆయన కుమారుడు అడ్డాకుల గుండునాయుడు గుమ్మలక్ష్మీపురం మండల అధ్యక్షుడిగా పనిచేశారు. గుండునాయుడు కుమారుడు గంగరాజు, కుమార్తె సర్పంచ్‌లుగా పనిచేశారు. ప్రస్తుత టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి భర్త సన్యాసినాయుడు ఈ అడ్డాకుల కుటుంబానికి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. గిరిజన ప్రాంతంలో ఈ కుటుంబానికి మంచి పేరు ఉంది.

పారాది వంతెన కథ అంతేనా?

- పాతది పటిష్ఠం చేస్తారట
- కొత్తదానిపై ఆశలు వదులుకోవాల్సిందేనా?
- వైసీపీ మాటలు నీటి మూటలేనా?



గతంలో వంతెనపై వేసిన బీటీ రోడ్డు (ఫైల్)

(బొబ్బిలి)

బొబ్బిలి-విజయనగరం రాష్ట్రీయ రహదారిలో పారాది వద్ద వేగావతి నదిపై నిర్మించ తలపెట్టిన వంతెన ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఆనవాలుగా కనిపిస్తోంది. కొత్త వంతెన పనులు ఇప్పట్లో కదిలేలా లేవు. మళ్లీ పాత వంతెననే పటిష్ఠ పరిచేందుకు అధికారులు కసరత్తులు ప్రారంభించారు. ఈ పనుల కోసం నిధుల వేట ప్రారంభమైంది. ఇంజనీరింగ్ నిపుణులను తెప్పించి బ్రిటిష్ కాలం నాటి పాతవంతెనను రవాణాకు అనుకూలంగా పటిష్ఠపరచడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పనుల కోసం సుమారు రూ.40 లక్షలు అవసరం ఉంటుందని అంచనా. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరైన ఈ వంతెన పనులు వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వంతెన నిర్మాణం కోసం రూ.10.90 కోట్లు మంజూరైన సంగతి తెలిసిందే. టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ ఆ కాంట్రాక్టరుకు గతంలో చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో ... ఈ పనులు చేపట్టేందుకు తటపటాయించినట్టు తెలుస్తోంది. దీనితో వంతెన నిర్మాణ వ్యయం రూ.13.82 కోట్లకు చేరుకుంది. పనులలో జాప్యమే ఇందుకు కారణం. 12 శాతం ఉండే జీఎస్టీ 18 శాతానికి పెరగడంతో అంచనా వ్యయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది.

గ్రామీణ రహదారులకు కష్టం

బ్రిటిష్ కాలం నాటి ఈ వంతెన కూలిపోయేందుకు సిద్ధంగా ఉండడంతో గత ఏడాది అక్టోబరులో తాత్కాలికంగా నిలబెట్టే ప్రయత్నాలు చేశారు. భారీ వాహనాలన్నిటినీ దారి మళ్లించారు. ఈ కారణంగా గ్రామీణ ప్రాంత రహదారులన్నీ దెబ్బ తింటున్నాయని ఆ గ్రామాల ప్రజలు.. వివిధ రాజకీయ పార్టీల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శిథిలమైన వంతెనను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు (ఫైల్)

ఎన్నో ఆందోళనలు

తెలుగుదేశం, జనసేన, వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలు ఈ వంతెన కోసం అనేకసార్లు ఆందోళన చేశాయి. దారి మళ్లించే వాహనాల కోసం వేగావతి నదిలో వంతెనకు సమీపంలోనే అప్రోచ్ రోడ్డు నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. దీనితో భారీ వాహనదారులు మళ్లించిన దారిలో వెళ్లడం... గ్రామీణులు ఇబ్బందులకు గురవడం షరా మామూలైంది.

నిపుణులను రప్పిస్తున్నాం

పాత వంతెనను మరింత పటిష్ఠ పరిచి వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చేందుకు నిపుణులను రప్పిస్తున్నాం. దీని కోసం రూ.40 లక్షలు అవసరమని భావిస్తున్నాం. విద్యుత్ లైన్లు మార్చాల్సి ఉంది. కాంట్రాక్టు ఏజెన్సీకి బిల్లులు పెండింగ్ ఉన్నమాట వాస్తవమే.

- జీవీ రమణ, ఈఈ, ఆర్అండ్‌బీ, విజయనగరం

అప్రోచ్ రోడ్డు పూర్తయినా..

వంతెనకు ప్రత్యామ్నాయంగా నదిలో అప్రోచ్ రోడ్డు నిర్మించే బాధ్యతలను టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరుకే అప్పగించారు. ఆ పనులను ఇటీవల పూర్తి చేశారు. అప్రోచ్ రోడ్డుపై ట్రయల్ రన్ కూడా వేశారు. వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు. దీనితో కొత్త వంతెన పనులు ప్రారంభమైపోతాయని అంతా అనుకున్నారు. కానీ పాతవంతెనను మరింత పటిష్ఠ పరిచేందుకు కలెక్టర్, జిల్లా పరిషత్ నుంచి నిధులను సమీకరించాలని అధికారులు తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. కొత్త వంతెన కోసం వైసీపీ నాయకులు హడావిడి చేశారని... ఇప్పుడేమో పాత వంతెన పనులు అంటున్నారని... ఇదెక్కడి చోద్యమని జనం విస్తుపోతున్నారు.



పారాది వద్ద వేగావతి నదిపై ఇటీవల నిర్మించిన అప్రోచ్ రోడ్డు

నోటరీలో జాగ్రత్త

తెలుసుకోండి

కొమరాడ: ఉమ్మడి జిల్లాలో నామినేషన్ వేసే అభ్యర్థులు నోటరీ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. లేదంటే నామినేషన్ తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉంది. సాధారణంగా నామినేషన్‌తో పాటు లైసెన్స్‌డ్ అడ్వొకేట్‌తో నోటరీ చేయించాలి. వీరిని గుర్తించడంలో అభ్యర్థులకు స్పష్టమైన అవగాహన అవసరం. ఆదాయం, స్థిర, చరాస్తులు, కేసులు, విద్యార్హతలు తదితర అంశాలను పొందుపరిచి... 13 డాక్యుమెంట్లతో కలిపి నామినేషన్ పత్రంతో పాటు వివరాలను ధ్రువీకరిస్తూ అఫిడవిట్‌పై నోటరీ సమర్పించాలి. జిల్లాలో చాలామంది అడ్వొకేట్లు నోటరీ లైసెన్సులు గడువు ముగిశాక రెన్యూవల్ దరఖాస్తు పంపి నోటరీగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే రిజిస్ట్రేషన్లు, స్టాంపులు శాఖ అనుమతి ఇస్తుంది. కొంతమంది గతంలో నోటరీ లైసెన్స్ పొంది... తర్వాత రెన్యూవల్ చేసుకోకుండా కొనసాగుతున్నట్టు సమాచారం. ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో నోటరీ పొందిన అడ్వొకేట్ల సమాచారం అందుబాటులో ఉంచారు. వీరి పేర్లను జిల్లా ఎన్నికల అధికారితో పాటు శాసన సభ రిటర్నింగ్ అధికారులకు కూడా పంపారు. రెన్యూవల్ చేయని వారు ధ్రువీకరిస్తే నామినేషన్లు చెల్లుబాటు కావని అభ్యర్థులు గుర్తించాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.



జన కేతనం
ఆంధ్రజ్యోతి శనివారం 20 ఏప్రిల్ 2024

1952లో తొలిసారి ఎన్నికలు

మీకు తెలుసా?

(విజయనగరం రూరల్)

స్వాతంత్య్రం వచ్చిన తరువాత భారతదేశంలో తొలిసారి 1952లో శాసనసభ, లోకసభకు ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో విజయనగరం ఉమ్మడి జిల్లా. బొబ్బిలి లోకసభ పరిధిలో విజయనగరం ఉండేది. 1952లో తొలి ఎంపీగా స్వాతంత్య్ర సమరయోధుడు కేఎస్ తిలక్ ఎన్నికయ్యారు. అదే ఏడాది విజయనగరం అసెంబ్లీ రిజర్వుడు స్థానానికి గంట్లాన సూర్యనారాయణ ఎన్నికయ్యారు. అసెంబ్లీ జనరల్ స్థానానికి డాక్టర్ పీవీజీ రాజు ఎన్నికయ్యారు. వీరు ముగ్గురూ మిత్రులే. సైకిళ్లపై తిరిగి ఎన్నికల ప్రచారం చేసేవారు. ప్రజలు చేస్తున్న పనుల్లో మమేకమై.. శ్రమదానం వంటి కార్యక్రమాలు నిర్వహించి.. ప్రశంసలు అందుకునేవారు.

● నెల్లిమర్ల నియోజకవర్గ ముఖచిత్రం

ప్రతిసారీ.. మార్చేస్తున్నారు!

● ఇదీ నెల్లిమర్ల ఓటర్ల తీరు ● 2009లో ఆవిర్భావం
● అంతకుముందు సతివాడ నియోజకవర్గం
● బడ్డుకొండ రెండుసార్లు... పతివాడ ఒకసారి విజయం
● తొలిసారి బరిలోకి జనసేన అభ్యర్థి
● రామతీర్థం పుణ్యక్షేత్రం ఇక్కడే..





సువిశాల సాగరతీరం... ప్రసిద్ధి చెందిన శ్రీరాముని ఆలయం...చైతన్యం గల ఓటర్లను కలిగిన నేపథ్యం... నెల్లిమర్ల నియోజకవర్గం సొంతం. రాజకీయ ఉద్దండులను అందించిన ప్రాంతమిది. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన నెల్లిమర్ల నియోజకవర్గ ఓటరు ప్రతి ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేలను మార్చేస్తున్నారు.

(నెల్లిమర్ల)

విజయనగరం జిల్లాలో అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావించే నియోజకవర్గం నెల్లిమర్ల. దీనికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. విశాలమైన సముద్ర తీరం. పొడవైన జాతీయ రహదారి ఉన్నాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల పరిధిలో సుమారు 20 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. వందేళ్ల చరిత్ర కలిగిన నెల్లిమర్ల జూట్ మిల్లుతో పాటు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన పుణ్యక్షేత్రం రామస్వామి వారి దేవస్థానం నెల్లిమర్ల మండలం రామతీర్థం గ్రామంలో ఉంది. జిల్లాలో ఏ నియోజకవర్గంలో లేని ఫార్మా కంపెనీలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. తలసరి ఆదాయ పరంగా చూస్తే విజయనగరం జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల కన్నా ఇక్కడ ఎక్కువేనని ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాజాగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నెల్లిమర్ల నియోజకవర్గంలోని భోగాపురంలోనే ఉంది. అపర భగీరథిగా పిలవబడే తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు ఇదే నియోజకవర్గంలో ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలోని సాగు, తాగునీటి అవసరాలు తీరనున్నాయి. నియోజకవర్గంలో 90 శాతం బీసీలే. అందులో తూర్పు కాపు సామాజిక వర్గం అధికం. ఆ తర్వాత యాదవులు, తెలగ కులస్తులు, మత్స్యకారులు, ఇతర సామాజిక వర్గాల వారు ఉంటారు. నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు 2.13.168 మంది ఉన్నారు.

2009లో ఆవిర్భావం..

ఒకప్పుడు ఇది సతివాడ నియోజకవర్గం. పునర్విభజన అనంతరం 2009లో నెల్లిమర్ల నియోజకవర్గం ఆవిర్భవించింది. అంతకుముందు ఉన్న సతివాడ నియోజక వర్గం నుంచి నెల్లిమర్ల మండలాన్ని, భోగాపురం నియోజక వర్గం నుంచి పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ మండలాలతో కలిపి కొత్తగా నెల్లిమర్ల నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గం ఆవిర్భావం తరువాత 2009, 2014, 2019 సంవత్సరాల్లో సాధారణ ఎన్నికలు జరిగాయి. తాజాగా నెల్లిమర్ల నియోజకవర్గంలో నాలుగోసారి సాధారణ ఎన్నికలు జరుగుతున్నాయి.


పెనుమత్స సాంబశివరాజు


పతివాడ నారాయణ స్వామి నాయుడు


పొట్నూరు సూర్యనారాయణ


బడ్డుకొండ అప్పలనాయుడు

సతివాడలో ఇలా..

సతివాడ నియోజకవర్గంలో నెల్లిమర్లకు చెందిన దివంగత బయిరెడ్డి సూర్యనారాయణ రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. గుర్ల మండలం పాలవలసకు చెందిన దివంగత పొట్నూరు సూర్యనారాయణ సతివాడ నియోజక వర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా నాలుగుసార్లు పోటీ చేసి 1994లో ఒకసారి విజయం సాధించారు. గతంలో విశాఖపట్నం పార్లమెంటు పరిధిలో ఉన్న భోగాపురం నియోజకవర్గానికి చెందిన దివంగత కొమ్మూరు అప్పడుదొర, దివంగత కొమ్మూరు సంజీవరావు క్రియాశీల రాజకీయాల్లో ఉండేవారు. అప్పడుదొర విశాఖ ఎంపీగా, జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పనిచేశారు. సంజీవరావు భోగాపురం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నాలుగు సార్లు పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఒకసారి విశాఖపట్నం ఎంపీగా గెలుపొందారు.

ఓటర్ల వివరాలు


పురుషులు	1,05,411 మంది
స్త్రీలు	1,07,754
ట్రాన్స్ జెండర్లు	3
మొత్తం	2.13,168 మంది
పోలింగ్ స్టేషన్లు	248

నెల్లిమర్ల నియోజక వర్గం ఎమ్మెల్యేలు..

సం.	పేరు	పార్టీ
2009	బడ్డుకొండ అప్పలనాయుడు	(కాంగ్రెస్)
2014	పతివాడ నారాయణస్వామి నాయుడు	(టీడీపీ)
2019	బడ్డుకొండ అప్పలనాయుడు	(వైసీపీ)

గత మూడుసార్లు ఫలితాలు ఇలా..

ఈ నియోజక వర్గంలో గత మూడుసార్లు ఫలితాలను పరిశీలిస్తే.. ఒక్కో ఎన్నికల్లో ఒక్కో పార్టీకి ఓటర్లు అవకాశం ఇచ్చారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన బడ్డుకొండ అప్పలనాయుడు, 2014లో టీడీపీ తరఫున పోటీ చేసిన పతివాడ నారాయణస్వామినాయుడు, 2019లో వైసీపీ అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు విజయం సాధించారు. బడ్డుకొండ అప్పలనాయుడు ఇంత వరకు మూడుసార్లు పోటీ చేసి.. రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తాజాగా నాలుగోసారి ఎన్నికల బరిలో దిగారు. టీడీపీ సీనియర్ నాయకుడు పతివాడ నారాయణస్వామినాయుడు భోగాపురం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో మొత్తం 8సార్లు పోటీ చేసి ఏడుసార్లు విజయం సాధించి చరిత్ర సృష్టించారు. ఈసారి ఆయనకు టిక్కెట్ దక్కలేదు. పొత్తులో భాగంగా ఈ నియోజక వర్గం నుంచి జనసేన అభ్యర్థి లోకం నాగమాధవికి టిక్కెట్ కేటాయించారు. ఇదే నియోజకవర్గ పరిధిలోని నెల్లిమర్ల మండలం మొయిద విజయరాంపురం గ్రామానికి చెందిన దివంగత పెనుమత్స సాంబశివ రాజు కూడా సతివాడ నియోజకవర్గం నుంచి ఎనిమిదిసార్లు పోటీ చేసి ఏడుసార్లు విజయం సాధించి చరిత్ర సృష్టించారు. ఆయన కుమారుడు డాక్టర్ పీవీవీ సూర్య నారాయణరాజు (సురేష్‌బాబు) ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.




నెల్లిమర్ల జ్యూట్ పరిశ్రమ


ప్రసిద్ధి చెందిన రామతీర్థం శ్రీరాముని ఆలయం


భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు (ఫైల్)

'ఆ'పాత మధురం


1983లో టీడీపీని గెలిపించాలని సాలూరులో ప్రచారం చేస్తున్న ఎన్టీఆర్

ఎన్టీఆర్‌తో రాజయ్య

సాలూరు రూరల్: టీడీపీ వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారక రామారావు 1983 ఎన్నికల్లో అప్పటి సాలూరులోని అభ్యర్థి బోయిన రాజయ్యను తన చైతన్యరథంపై ఎక్కించి ప్రచారం చేశారు. అప్పట్లో ప్రచారం చేస్తున్న ఫొటో శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. అప్పట్లో రాజకీయాలకు పరిచయం లేని ఉపాధ్యాయుడు బోయిన రాజయ్యకు ఎన్టీఆర్ టిక్కెట్ ఇచ్చి గెలిపించారు. ప్రస్తుత ఎన్నికల తరుణంలో ఈ ఫొటోను అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ఫుల్లుగా మందు


ఇక్కడ మందుకు కొదువలేదు..

బొబ్బిలి, ఏప్రిల్ 19: బొబ్బిలి సిటింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి శంబంగి వెంకటచినఅప్పలనాయుడు శుక్రవారం నామినేషన్ వేసిన సందర్భంగా మద్యం యథేచ్ఛగా పంపిణీ చేయడం కనిపించింది. ఆర్డీవో కార్యాలయం వరకు చేపట్టిన ర్యాలీలో ఎక్కడికక్కడ మద్యం ఇచ్చారు. స్థానిక ఫ్లైఓవర్ ముందు శంబంగి ఎన్ని కల ప్రచార వాహనంపై మాట్లాడారు. ఆ సమయంలో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి పోలీసులు ఆపసోపాలు పడాల్సి వచ్చింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఆటోలు, వ్యాన్‌లు ఇతర వాహనాలతో జనాలను తరలించారు. వీరందరికీ డబ్బులు, మద్యం, బిరియానీ ప్యాకెట్లు స్థానిక నాయకులతో పంపిణీ చేయించారు.


ఇక్కడ నీటికి దిక్కులేదు.. వాటర్ బాటిల్స్ కోసం తోపులాట

నామినేషన్ల పర్వం

సార్వత్రిక ఎన్నికల ఘట్టంలో రెండో రోజు శుక్రవారం వివిధ పార్టీల అభ్యర్థులు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. ఆలయాల్లో ప్రార్థనలు చేసి... నామినేషన్ పత్రాలను తమ ఇష్ట దైవాల ముందు ఉంచి పూజలు చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి అధికారులకు సమర్పించారు.


విజయనగరం: టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడికి గజమాల


శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్తున్న కలిశెట్టి




రాజాం: శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళుతున్న ఉమ్మడి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్




నెల్లిమర్ల: ర్యాలీగా వెళ్తున్న ఎన్డీఏ కూటమి అభ్యర్థి నాగమాధవి

రేపు ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

గజపతినగరం: మరుపల్లి ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు ఈనెల 21 ఆదివారం పరీక్షలు నిర్వహించనున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లును డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని, విద్యార్థులు ఉదయం 9 గంటలకే పాఠశాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

అభివృద్ధి చేయని ఎమ్మెల్యే ఓట్లెలా అడుగుతారు?

కొత్తవలస: నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఏ అభివృద్ధీ చేయలేదని, మరి ఇప్పుడు ఎలా ఓటు వేయాలని అడుగుతారని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం కొత్తవలసలోని పార్టీ కార్యాలయంలో విశాఖపట్టణం పార్లమెంటరీ నియోజక వర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు, విశాఖ పార్ల మెంటరీ పార్టీ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటర రమణ విలేకర్లతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చిన కడుబండి భూ కబ్జాలకు పాల్పడ్డం తప్ప ఏ పనీ చేయలేకపోయారన్నారు.

తునివాడలో పారిశుధ్య చర్యలు

రేగిడి: మండలంలో తునివాడ గ్రామంలో అపారిశుధ్య పరిస్థితులపై మండలపరిషత్ యంత్రాంగం దృష్టి సారించింది. ఆంధ్రజ్యోతిలో ఈనెల 17న తునివాడలో అపారిశుధ్యం, చర్యలు తీసుకుని అధికారులు అనే శీర్షికన వార్త ప్రచురణ అయింది. దీనిపై ఎంపీడీవో శ్యామలాకుమారి, ఈవోఆర్డీ సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శి పరుశరాంకు వివరణ కోరి తక్షణమే పారిశుధ్య చర్యలకు ఆదేశించారు. ఈ క్రమంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రా మంలో తీవ్ర అపారిశుధ్యం పేరుకుపోయిన వీధిలో పెంట కుప్పల తొలగింపు, సీసీ రోడ్డు పరిశుభ్రత చర్యలు చేపట్టారు. మిగతావీధిల్లో డ్రైనేజ్ పూడికలు పేరుకుపోయి కనిపిస్తుండగా, దీనిపై పంచాయతీ చర్యలు తీసుకుంటుందని ఈవోపీఆర్డీ సత్యనారాయణ తెలిపారు.

నామినేషన్ వేసిన కొండపల్లి

గజపతినగరం: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. తన నామినేషన్ పత్రాలను ఆర్డీవో ఎంవీ సూర్యకళకు అందజేశారు. ఆయన వెంట పలువురు కూటమి నాయకులు ఉన్నారు.

జగన్‌రెడ్డి ఓ నియంత: కోండ్రు

రాజాం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఓ నియంత.. ఆయనకు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పట్ల గౌరవం లేదని మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ వేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు జగన్‌ను ఓడిస్తారని పేర్కొన్నారు.

నామినేషన్‌కు వచ్చినవారికి ధన్యవాదాలు

రాజాం: నామినేషన్ కార్యక్రమం విజయవంతం చేసినందుకు కోండ్రు మురళీమోహన్ ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రటకన విడుదల చేశారు. తీవ్ర ఎండలో సైతం వ్యయ ప్రయాసలకోర్చి ర్యాలీలో పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజాం నియోజకవర్గాన్ని రాష్ట్రంలో గుర్తింపు వచ్చే విధంగా అభివృద్ధి చేసి చూపిస్తానని హామీయిచ్చారు.

చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి: కోళ్ల

వేపాడ: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమౌతోందని శృంగవరపుకోట నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కోళ్ల లలితకుమారీ అన్నారు. మండలంలోని వల్లంపూడి, వేపాడ గ్రామాల్లో డోర్ టూ డోర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ, జనసేన నాయకుడు ఒబ్బిన సత్యనారాయణ, మండల నాయకులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకుల పర్యటన

కలెక్టరేట్: రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనీ నిగం శనివారం జిల్లాకు రానున్నారు. శ్రీకాకుళం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 4 గంటలకు విజయనగరం చేరుకుని 4 నుంచి 7 గంటల వరకూ కలెక్టర్‌తో, వ్యయ పర్యవేక్షణ బృందాలతో సమీక్షిస్తారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కొత్తవలస: జాతీయ అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం కొత్తవలస అగ్నిమాపక అధికారి వై.అశోక్ కుమార్ కొత్తవలసలోని వివిధ ఆసుపత్రుల్లో సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిప్రమాదాల నియంత్రణకు ఆసుపత్రుల్లో ఎటువంటి పరికరాలను ఉంచుకోవాలనే విషయాలను తెలిపారు. అగ్ని ప్రమాదా లు సంభవించినప్పుడు ప్రాథమికంగా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఆసుపత్రులలో వివిధ కారణాల వలన అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయన్నారు.

జనసేనలోకి నక్కాన వెంకటరావు

నెల్లిమర్ల: నెల్లిమర్లకు చెందిన వైసీపీ నాయకుడు, విశాఖపట్నం జూ మాజీ డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ నక్కాన వెంకటరావు శుక్రవారం వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. శుక్రవారం నెల్లిమర్ల రామతీర్థం జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన తోపాటు ఆయన అనుచరులకు కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి కండువాలు కప్పి, జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ ప్రాంతంలో పార్టీ పటిష్టతకు, ఈ ఎన్నికల్లో తన విజయానికి కృషిచేయాలని ఆమె కోరారు.

మార్పు ఉంటే అభివృద్ధి సాధ్యం

గజపతినగరం: రాజకీయాల్లో మార్పు ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, అది ఒక్క చంద్రబాబుకే సాధ్యపడుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రజలు విసిగిపోయారని కేంద్ర ప్రభుత్వ పథకాలు తమ పథకాలుగా చిత్రీకరించుకుని పబ్బం గడిపారని ఆరోపించారు. అందరూ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలన్న లక్ష్యంతో పని చేయాలన్నారు. జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ, కొండపల్లి సింధు, కొండపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట శ్రీనివాస కాలనీలో ప్రచారం

శృంగవరపుకోట: శాసన సభ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి, విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్‌కు మద్దతుగా శృంగవరపుకోట శ్రీనివాసకాలనీలో శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు కొణదం మల్లేశ్వరరావు, నానిగిరి రమణాజీ, కాపుగంటి శ్రీనివాసరావు (వాసు) పెదగాడి రాజు, చెక్క కిరణ్ కుమార్, వాకాడ బాలు తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ సూపర్ సిక్స్ మేనిఫెస్టోను వివరించారు. పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం బాగుపడుతుందన్నారు.

ఇంకా అధ్వానంగానే..

- శిథిలావస్థలో పాఠశాల
- 5 తరగతులకు ఒక గది, వరండానే దిక్కు
- మరుగుదొడ్డి కోసం ఇంటికి పరుగెత్తాల్సిందే


శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లు


వరండాలోనే తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

భోగాపురం: కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు.. నాడు నేడు అంటూ హడావుడి చేశారు.. కానీ ఇవన్నీ ఉత్తిదే అని, ఇంకా క్షేత్రస్థాయిలో చాలా పాఠశాలలు ఇంకా అధ్వానంగానే ఉన్నాయన్న నిజం ఈ పాఠశాలను చూస్తే తెలుస్తుంది.

భోగాపురం మండలం రావాడ పంచాయతీలో రావాడగొల్లపేట ఆర్ ప్రాథమిక పాఠశాల పరిస్థితి చాలా అధ్వానంగా తయారైంది. ఇక్కడ 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 40 మంది విద్యార్థిని విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ముగ్గురు ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. 5 తరగతు లకు గాను ముగ్గురు ఉపాధ్యాయులున్న ఈ పాఠశాలలో ఒక గది, ఒక వరాండానే ఉన్నాయి. ఇది కూడా శిథిలమయ్యే దశలో ఉంది. నిరంతరం పెచ్చులూడుతూనే ఉంది. వర్షం పడితే పాఠశాల తడిసి పోవాల్సిందే. ఇక్కడ మ రుగుదొడ్లు ఉన్నా పూర్తిగా పాడవడంతో నిరుపయోగంగా వదిలేశారు. విద్యార్థివి ద్యార్థినులు మరుగుదొడ్లు, బాత్‌రూంలు అవసరమైతే ఆరుబయట లేదా ఇంటికి వెళ్లి తిరిగి రావాల్సిందే. మరుగుదొడ్లు లేకపోవడంతో ఉపాధ్యాయుల పరిస్థితి చెప్ప నవసరంలేదు. ఇది ఇక్కడ ప్రభుత్వ పాఠశాల దుస్థితి. ఇలాంటి పాఠశాలలతో విద్యా ర్థులు అవస్థలు పడుతున్నారు. అయితే గత ప్రభుత్వం హయాంలోనే ఇక్కడ అద నపు తరగతి గదులు మంజూరైనా కొన్ని కారణాలతో పునాదుల్లోనే నిర్మాణం నిలు పుదల చేశారు. ఇప్పటికైనా పాఠశాల మరమ్మతులు చేయించి, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే విదంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేసి తరగతులకు సరిపడా గదులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతల రామచంద్రరావు మాట్లాడుతూ స్లాబ్ పెచ్చులు ఊడుతున్నాయని, మూడునాలుగు రోజులు వర్షం వస్తే పూర్తిగా కారిపోతుందని 5 తరగతులకు ఒకే గది, వరండాలోనే తరగుతులు నిర్వహిస్తున్నామన్నారు. మరుగుదొడ్లులేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల సమస్యపై మండల విద్యాశాఖా అధికారికి, నాయకులకు తెలియజేశామన్నారు.

గౌతు లచ్చన్నకు నివాళి


గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలవేస్తున్న దృశ్యం


గజపతినగరం: కల్లు గీత కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా చట్ట సభల్లో గౌతు లచ్చన్న తన గళం విప్పేవారిని అటువంటి వ్యక్తి ఆశయాలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమని కల్లు గీత కార్మికుల జిల్లా అధ్యక్షుడు కొల్లి అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయం ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుకు వచ్చే ప్రభుత్వం చొరవ చూపాలని, అలాగే కల్లుగీత సంఘానికి 10 సెంట్ల స్థలం మంజూరు జరిగే వరకు పోరాటం సాగిస్తామన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు పురం అప్పారావు, కోలిసి సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అక్రమాలు పెరిగిపోయాయి: కళా


కళావెంకటరావుకు హారతులు పడుతున్న మహిళలు

గుర్ల: రాష్ట్రంలో అన్యాయాలు, అక్రమాలు పెరిగిపోయాయని చీపురుపల్లి నియోజవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు అన్నారు. చిన్న నాంగళ్లవలస, తాటిపూడి, గొలగము, రాగోలు గ్రామాల్లో ఆయన శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో అక్రమాలు, అన్యాయాలు పెరిగిపోయాయన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే చీపురుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ విప్ గద్దె బాబురావు, పార్టీ నాయకులు రామ్‌మల్లిక్‌నాయుడు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు వెన్ని సన్యాసినాయుడు, కిరణ్‌కుమార్, చనమల మహేశ్వరరావు, విమలారాణి, దాసరి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది టీడీపీ ప్రభుత్వమే: బేబీనాయన


బాడంగి: పినపెంకిలో బేబీనాయనకు, తెంటుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

బొబ్బిలి: వస్తున్న ఎన్నికల్లో గెలిచేది టీడీపీ కూటమేనని ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన అన్నారు. జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామితో కలిసి శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని చింతాడ గ్రామానికి చెందిన చింతాడ జయప్ర దీప్, కర్రి అప్పలనాయుడు, తవిటినాయుడు, రాము, తోడబండి కృష్ణంనాయు డుల ప్రోద్బలంతో వంద కుటుంబాల వారు బొబ్బిలి కోటకు వచ్చి బేబీనాయన సమక్షంలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే శంబంగి స్వగ్రామమైన పక్కి నుంచి వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. బొబ్బిలి పట్టణంలోని 26వ వార్డుకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు రెడ్డి సత్యంతో పాటు 50 కుటుంబాల వారు బేబీనాయన సమక్షంలో టీడీపీలో చేరారు. **బాడంగి:** బొబ్బిలి టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన శుక్రవారం పినపెంకి, పి.వెంకంపేట, జీకేఆర్.పురం, ఆకులకట్ట, డి.వెంకంపేట గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడుతో కలిసి ప్రచా రం చేశారు. మండలంలోని ఎరుకుల పాకల గ్రామంలో టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు ఆధ్వర్యంలో నిర్వహించిన రాజులమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి బేబీనాయన హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త దాసరి అంజితోపాటు పలువురు గ్రామస్థులు బేబీనాయనకు స్వాగతం పలికారు. ● **రామభద్రపురం:** మండల పరిధిలోని ఎస్.సీ తారాంపురం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి బొబ్బిలి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బేబీనాయన సమ క్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నాయి.

ఎన్నికల నియమావళి ఉల్లంఘించకండి


మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 19: ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు జరుగుతుంటాయని, ఆ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ రూపొందించిన నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించి, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలని టీడీపీ సీనియర్ నేత, కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతిరాజు చెప్పారు. శుక్రవారం ఎన్‌డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు నామినేషన్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మట్లాడారు. మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి, ఎన్‌డీఏ కూటమి విజయనగరం, ఎచ్చెర్ల అభ్యర్థులు ఆదితి గజపతిరాజు, నడికుదిటి ఈశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

- వైసీపీ కార్యకర్తలను తరలిస్తున్న ఆటో ఢీకొనడంతో ఘటన


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దిలీప్

బొబ్బిలి, ఏప్రిల్ 19: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి జనాలను తరలిస్తున్న ఆటో ఢీకొని మోటారుబైకుపై వెళుతున్న యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెర్లాం మండలం కూనాయవలస నుంచి వైసీపీ తరఫున జనాలను తరలించి వెళుతున్న ఆటో స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియం జంక్షన్ దగ్గర రాజాన దిలీప్ అనే యువకుడిని బలంగా ఢీకొంది. బొబ్బిలి రంగరాయపురం గ్రామానికి చెందిన దిలీప్ ప్రైవేట్ కొరియర్ సంస్థలో డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం కళాభారతి పక్క సందు నుంచి బైకుపై వస్తుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో దిలీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసులో కూనాయవలసకు చెందిన ఆటో డ్రైవర్ సింహాచలంను అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

ఎమ్మెల్యే నామినేషన్‌లో వలంటీర్


ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఇతర వైసీపీ ప్రజాప్రతినిధులతో వలంటీర్ గణేష్ (ఎర్రటీషర్ట్)

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 19: ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నామినేషన్ కార్యక్రమంలో మండలంలోని బొడ్డవర పంచాయతీ భవానీనగర్‌కు చెందిన వజ్రపు గణేష్ పాల్గొన్నాడు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో పూర్తిస్థాయి వైఎస్ఆర్ కార్యకర్తలా మారిపోయి స్థానిక నాయకులు, కార్యకర్తలతో తిరిగాడు. ఎమ్మెల్యే కడుబండి, మాజీ ఎమ్మెల్యే రవిబాబు, ఇతర నాయకులతో ఫొటోలకు ఫోజులు ఇచ్చాడు. ఈవిషయంపై బొడ్డవర సచివాలయం డీడీవో ను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, వచ్చిన వెంటనే ఇతన్ని సర్వీస్‌నుంచి రిమూవ్ చేయడంతో పాటు ఎంపీడీవోకు నివేదిక ఇచ్చి ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రవర్తించడంపై ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశామని తెలిపారు. ఈ విషయంపై పలువురు మాట్లాడుతూ ఇంకా చాలా మంది వలంటీర్లు వైసీపీ సేవలో ఉన్నారని వారు బహిరంగంగా తిరుగుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యులు కండి: అదితి


మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 19: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వామ్యులు కావాలని ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఎన్‌జీవో మాజీ నాయకుడు పేడాడ జనార్ధన్, తిర్లంగి రాంబాబు, మెట్ట రవి, పట్నాల సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో 200 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారందరికీ అదితి గజపతిరాజు పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించి ఆమె మాట్లాడారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ● సార్వత్రిక ఎన్నికల సమరానికి సమయం ఆసన్నమైందని, క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతినాయకుడు, కార్యకర్త విజయమే లక్ష్యంగా పనిచేయాలని అదితి గజపతిరాజు సూచించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మండల పరిధిలోని 22 గ్రామాలు, నగరంలోని 31వ డివిజన్ నుంచి 40వ డివిజన్‌లకు సంబంధించిన కుటుంబ సాధికారితలు, కార్యవర్గాలు, యువత, మహిళా కమిటీలతో సమావేశం నిర్వహించారు. ● ఎన్నికల ప్రచారంలో భాగంగా తోటపాలెం, అదే విధంగా ధర్మపురి ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటైన ప్రచార సభల్లో ఆమె మాట్లాడారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత వైసీపీకి జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

బాడంగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను బొబ్బిలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి మోహనరావు శుక్రవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో విద్యార్థులు తరగతులకు వెళ్లి విద్యార్థులచే చదివించడం, రాయించడం, ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టడం వంటివి చేశారు. అనంతరం మధ్యాహ్నభోజనం పరిశీలించారు. మండల విద్యాశాఖాధికారి ఎం.రాజేశ్వరి, హెచ్ఎం దత్తి సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

సింహాచలం దేవస్థానం కలెక్టర్ చేతిలోనా?

- ఈవోకు పూసపాటి అశోక్‌గజపతిరాజు లేఖ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలేశుని చందనోత్సవం ఏర్పాట్లు, గత ఏడాది ఉత్సవ నిర్వహణలో వైఫల్యం, దానికి బాధ్యులు ఎవరు?...అనే అంశాలపై దేవస్థానం అనువంశిక ధర్మకర్త, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు తాజాగా ఆలయ ఈఓకు ఓ లేఖ రాశారు. అందులో అనేక అంశాలను ప్రస్తావించి, ప్రశ్నించారు. దేవస్థానం స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అని, దాని ప్రత్యేకతను అధికారులు కాపాడాలని కోరారు. ప్రతి అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళుతున్నామని చెబుతున్నారని, ఆయన 'ఓకే' అంటే అమలు చేస్తామనే విధంగా వ్యవహరిస్తున్నారని, కలెక్టర్‌కు దేవస్థానంతో సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

-గత ఏడాది చందనోత్సవం చాలా ఘోరంగా జరిగిందని, నిర్వహణలో అధికారులు విఫలమయ్యారని, దానిపై జాయింట్ కలెక్టర్ విచారణ జరిపి దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదిక పంపించారని, అది ఇంతవరకూ ఎందుకు తెప్పించలేదని ఈఓను ప్రశ్నించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే దేవస్థానానికి చెడ్డపేరు రాదా?...అని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తప్పులు ఎక్కడ జరిగాయో తెలుసుకొని, వాటిని తక్షణమే సవరించుకోకపోతే ఎలా?...అని ప్రశ్నించారు. వారు నివేదిక ఇచ్చినప్పుడే చేస్తామని ఎన్ని రోజులు కాలయాపన చేస్తారో చెప్పాలని కోరారు. గత ఏడాది తప్పులు చేసిన వారు మళ్లీ ఇప్పుడు అవే తప్పులు చేస్తే దానికి బాధ్యత ఎవరు వహిస్తారో చెప్పాలన్నారు. తక్షణమే నివేదిక తెప్పించి, బాధ్యులపై ఉత్సవంలోగానే చర్యలు తీసుకోవాలని పరోక్షంగా సూచించారు.

- ఈ ఏడాది మే 10వ తేదీన నిర్వహించాల్సిన చందనోత్సవానికి సంబంధించి సమీక్ష సమావేశం ఏర్పాటుచేసి, దాని తీర్మానాన్ని కలెక్టర్‌కు ఆమోదం కోసం పంపామని ఈవో కార్యాలయం నుంచి తనకు లేఖ వచ్చిందని, ఏ చట్టం ప్రకారం కలెక్టర్‌కు పంపించారని అశోక్ ప్రశ్నించారు. ఆయన ఒప్పుకుంటేనే చర్యలు తీసుకోవాలనే నిబంధన ఎక్కడుందని ఆయన నిలదీశారు. దేవస్థానానికి స్వయం ప్రతిపత్తి ఉందని, దానిని తీసుకువెళ్లి కలెక్టర్ చేతిలో ఎలా పెడతారన్నారు. కలెక్టర్ సమయానుకూలంగా మంచి సూచనలు చేస్తే తీసుకోవడంలో తప్పు లేదని, కానీ ఆయన చెప్పేంత వరకు పనులు చేపట్టకుండా కూర్చొంటారా?, ఈలోగా పనులు చేయాల్సిన బాధ్యత మనకు లేదా?...అని ఆయన అడిగారు.

ఏ విషయమన్నా చెబుతున్నారా?

గత ఏడాది చందనోత్సవం వైఫల్యం సమీక్ష నుంచి ఇప్పటివరకు పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదని అశోక్‌గజపతిరాజు ఆరోపించారు. దేవస్థానానికి కమిటీ వేసినా, వేరే ఏ కార్యక్రమం చేసినా ధర్మకర్తకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం గురించి చెప్పలేదని, అందులో తీసుకున్న నిర్ణయాలు కూడా తనకు తెలియజేయలేదన్నారు. ఇవన్నీ చూస్తుంటే..శ్రీవరహా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం స్వయం ప్రతిపత్తిని, కీర్తిని కావాలనే దెబ్బతీస్తున్నట్టుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం

- 9 మందికి తీవ్ర గాయాలు


గాయాలైన దృశ్యం

బొండపల్లి, ఏప్రిల్ 19: బొండపల్లి గ్రామంలో పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి పలువురిని గాయపరిచింది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం గ్రామంలోని యాత వీధిలో ఓ పిచ్చికుక్క ఆరుబయట ఉన్నవారిపై విచక్షణా రహితంగా దాడిచేసి కరిచింది. దీంతో స్థానికులు కుక్కను కర్రలతో భయపెట్టగా అక్కడ నుంచి జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న టీపాయింట్‌కు సమీపంలో మరికొంతమందిపై దాడిచేసి కరిచింది. అక్కడ నుంచి జాతీయ రహదారి పక్కన తాటిముంజెలు అమ్ముకుంటున్న వారిపై, రోడ్డుపక్కన లారీ ఆపిన డ్రైవర్‌పై కూడా దాడిచేసి గాయపరిచింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన పి.అచ్చియ్యమ్మ, బి.కృష్ణమ్మ, బి.సంతోష్, కే.సురేష్, పి.రామలక్ష్మి, వై.సన్యాసికి తీవ్ర గాయాలు కాగా వీరిని బొండపల్లిలోని పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. బొండపల్లి పీహెచ్‌సీలో నీలాతి రాము, పురం రామలక్ష్మి, ఎర్ర సన్యాసి చికిత్స పొందుతున్నారు. గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బాడంగి: కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆనవరం గ్రామానికి చెందిన తూముల విజయ్‌కుమార్(23) మూడు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని చికిత్సలు తీసుకున్నా కడుపునొప్పి తగ్గకపోవడంతో విరక్తి చెంది గురువారం ఉదయం గ్రామ సమీపంలోని అరటితోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మృతుడి సోదరుడు, స్నేహితులు బొబ్బిలిలోని ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి తూముల కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

గంట్యాడ: మండలంలో నరవ గ్రామంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఎల్.అప్పలనాయుడు అనే వ్యక్తిని శుక్రవారం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పట్టుకున్నారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేసి ఆయన వద్ద 96 మద్యం బాటిల్స్, ఒక బైక్ కూడా స్వాధీనం చేసుకున్నారు.

అన్యాయంగా మాపై అట్రాసిటీ కేసు


ఏఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న బూసాయవలస బీసీ కులస్థులు

రామభద్రపురం, ఏప్రిల్ 19: మండల పరిధిలోని బూసాయవలస గ్రామంలో ఎస్టీ కులస్థులు తమపై అన్యాయంగా అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారని బీసీ కులాలకు చెందిన కోరుకొండ సత్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం సుమారు వందమంది ఏఎస్ఐ చిన్నయ్యకు వినతిపత్రం అందించారు. తమ జిరాయితీ భూమిని ఆక్రమించుకోవడానికి ఇటువంటి కుట్రలు పన్నుతున్నారని, తాము కులంపేరుతో తిట్టలేదని స్పష్టం చేశారు. ఆ భూమికి సంబంధించి అన్ని హక్కులు ఉన్నాయని, దీనిపై స్పందనలో ఫిర్యాదు చేసిన వెంటనే తహసీల్దార్ సర్వేయర్‌ను పంపించి ఆ భూమికి హద్దులు చూపించి ఎండోర్స్‌మెంట్ మాకిచ్చారని తెలిపారు. అయినప్పటికీ అదే గ్రామానికి చెందిన దుక్క త్రినాథ, మరికొంతమంది తాము నిర్మిస్తున్న ఇంటి వద్దకు వచ్చి తమను తీవ్రంగా గాయపరచి మళ్లీ తమపైనే ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై పోలీసులు విచారించి తమపై తపడు కేసులు పెట్టిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి ఆస్తుల వివరాలు

బొబ్బిలి: బొబ్బిలి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసిన శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆస్తుల వివరాలు శుక్రవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించిన అఫిడవిట్‌లో తన ఆస్తుల వివరాలను వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆయన ఆదాయం రూ.8,28,547...

-శంబంగి సతీమణి ఆదాయం: రూ. 44,25,536 (ఆమె స్థిరాస్తులు రూ. 1,76,25,171 + చరాస్తులు రూ. 1,33, 94,000/-) గా వివరించారు.

షర్మిలను కలిసిన కంబాల

రాజాం: రాష్ట్ర పిసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను రాజాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంబాల రాజవర్ధన్ శుక్రవారం కలుసుకున్నారు. ఆలూరులో పిసీసీ అధ్యక్షురాలు షర్మిల అభ్యర్థులకు బి ఫామ్ ఇస్తున్న విషయం తెలిసుకొని అక్కడకు చేరుకొని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె నుంచి బి ఫామ్ తీసుకున్నారు. పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని షర్మిల సూచించినట్లు కంబాల తెలిపారు.